# (అ)భూతవైద్యం
## వేమూరి వేంకటేశ్వరరావు

### 1

రామేశం గారికి పిఠాపురం బదిలీ అయింది.

ఎదురూ బొదురూ లేని ఈ ఉద్యోగాలకి ఎందుకో మూడేళ్లకోసారి ఈ బదిలీలు?

సంసారాన్ని కదపడానికి ఇష్టం లేక అందరినీ తునిలోనే వదిలేసి తను ఒక్కరూ పిఠాపురంలో నాతిగల బ్రహ్మచారిలా ఉండడానికే రామేశం నిశ్చయం చేసుకున్నారు. మరో మూడేళ్లు కండ్లు మూసుకు గడిపేస్తే మళ్లా తుని బదిలీ చేయించుకోవచ్చని ఆయన పథకం.

రామేశం గారు తిరిగి పిఠాపురం వస్తున్నారన్న వార్త తెలియగానే పురాణం శాస్త్రి గారి మనస్సు ఎగిరి గంతేసింది.

తుని రాక పూర్వం రామేశం గారు పిఠాపురం లోనే పని చేసేవారు. అందుకని ఆయనకి ఆ ఊరు నిండా స్నేహితులే. అందరిలోకీ ముఖ్యుడు పురాణం శాస్తుర్లు గారు. రామశాస్త్రి గారి ఇంటిపేరు పురాణం వారు కానే కాదు. 'తింటే గారెలే తినాలి, వింటే భారతమే వినాలి' అంటామే అలాగ 'భారత పురాణం వింటే రామశాస్త్రి గారు చెప్పినప్పుడే వినాలి' అని పిఠాపురంలో అనుకునే వారు.

మల్లెపువ్వు లాంటి మల్లు పంచె, జరీ అంచు ఉత్తరీయం, దబ్బ పండు ఛాయలో ఉన్న నుదిటి మీద కనిపించీ కనిపించనట్లు విభూతి రేఖలు, చెవులకి కుండలాలతో ఉన్న ఆ మనిషిని చూడగానే లక్ష్మీ ప్రసన్నుడనిన్నీ, సరస్వతీ కటాక్షం గల పండితుడనిన్నీ సునాయాసంగా చెప్ప వచ్చు. మహాభారత తత్వ కథనం అని పది సంపుటాల ఉద్గ్రంథం ఒకటి – అది నారికేళ పాకమో, తెలుగు లిపిలో రాసిన సంస్కృతమో మనకి తెలియదనుకొండి – రచించి, సొంత డబ్బు ఖర్చు పెట్టి అచ్చు వేయించినప్పుడు రామేశం గారికి ఆయన ఒక సంపుటాన్ని ప్రత్యేకంగా బహూకరించేరు.

ఏదో ఉద్యోగం చేసి నాలుగు జీతపు రాళ్లు తెచ్చుకుంటూన్న రామేశం ఎక్కడ? మహాభారత తత్వ కథనం రచించిన రామశాస్త్రి ఎక్కడ? వీరిద్దరికీ మధ్య పొంత, పొత్తు కుదరడానికి కారణం రామేశం గారి చేతిలో ఉన్న హోమియోపతీ వైద్యమే కొంత వరకూ కారణం.

రామేశం గారికి చిన్నతనంలో అజీర్తి వ్యాధి ఉండేది. ఏది తిన్నా పడేది కాదు. ఎవరు ఏ మందు వేసినా గుణం కనిపించ లేదు. ఆఖరికి హోమియోపతీ వైద్యం స్వంతంగా నేర్చుకుని తన జబ్బుని తనే కుదుర్చుకున్నారు. గొర్రె తోక లాంటి ఎదురూ బొదురూ లేని ఉద్యోగం. ఇంట్లో ఇంటెడు పిల్లలు. కనుక పిల్లలు ఎవరు ముసముస లాడినా, మూలిగినా, ఆసుపత్రుల వెంట తిరగ లేక ఆయనే ఒక మాత్ర వేసే వారు. ఆయన చేతి మాత్ర వల్లే తగ్గేదో, కాయవలసిన జ్వరం నాలుగు రోజులూ కాసిన తర్వాతే తగ్గేదో 'సైంటిఫిక్' గా తేల్చి చెప్పడానికి మన దగ్గర సాధన సంపత్తి లేదు. కాని, వేసిన మాత్రలకి గుణం కనిపించినట్లు అనిపించేది. ఇంగ్లీషు డాక్టర్లు ఇచ్చే చేదు అరఖులు తాగలేక పిల్లలు పంచదార మాత్రలంటేనే ఇష్టపడే వారు. అందువల్ల ఆ ఇంట్లో, ఆ

వీధిలో, ఆ ఊళ్లో, రామేశం గారి దగ్గర మందు పుచ్చుకోని సంసారం లేదు. పక్కింట్లో ఉన్న శాస్త్తుర్లు గారు కూడ అడపా తడపా ఒక మాత్ర అడిగి పుచ్చుకుంటూనే ఉండేవారు.

రామేశం గారి దగ్గర మరొక సారి మాత్ర పుచ్చుకోవలసిన అవసరం వచ్చింది, శాస్త్రుర్లు గారికి. తనే తుని వెళ్లి మట్లాడి వద్దామనుకుంటూ ఉంటే ఆడబోయిన తీర్థం ఎదురైనట్లు ఆయనే వీధి గుమ్మంలో తారస పడ్డారు.

గుమ్మంలో ఉన్న గూనలో నీళ్లు తీసుకుని కాళ్లూ చేతులూ కడుక్కుని, శాస్తుర్లు గారి కొడుకు అందించిన మంచి తీర్థం పుచ్చుకుని ప్రయాణపు బడలిక తీర్చుకుంటున్నారు రామేశం.

''వేడి నీళ్లు సిద్ధంగా ఉన్నాయి. స్నానం చేసేయండి. తర్వాత భోజనం చేసేద్దాం.'' అన్న శాస్తుర్లు గారి మాటలలోని అంతరార్థాన్ని గ్రహించి, పెరట్లోకి వెళ్లి స్నానం చేసేసి, ఆయన అందించిన పొత్తు పంచ కట్టుకుని, శాస్త్రి గారింట మర్యాద కొరకు దేవతార్చన చేసి, పీట మీద కూర్చున్నారు. వంట మనిషి వడ్డిస్తూ ఉంటే శాస్తుర్లు గారు, రామేశం గారు పాత రోజులు తలుచుకుంటూ భోజనం చేస్తున్నారు.

''పార్వతికి ఒంట్లో బాగుండడం లేదు. మీరు ఒక సారి చూసి ఒక మాత్ర వేస్తారేమో కనుక్కోమని ఆయనతో ఎంతగా చెప్పినా అశ్రద్ధ చేస్తున్నారు...'' తలుపు చాటున నిలబడ్డ కామాక్షమ్మ మాటలో మాట కలిపింది.

''ఏం? రామేశం? నాకు మందు ఇవ్వడానికి వచ్చేవా? బాగుంది. నువ్వు నాకు మందివ్వడం, నేను పుచ్చుకోవడం. చాలా బాగుంది. ...''

నోట్లో ముద్ద నోట్లోనే ఉంది. తనని ఈ ఇంట్లో ఏక వచనంతో సంబోధించేదెవరా అని నిర్విణ్ణుడైన రామేశం ఆ శబ్దం వచ్చిన దిశగా చూసేరు. జుత్తు విరగబోసుకొని కనిపించింది ఒకామె. ఎవరా అని చూస్తే ఆమె శాస్త్రి గారి కోడలు పార్వతి!

''... బాగుంది నీ వరస. నువ్వు నాకు మందివ్వడ మేమిటి, రామేశం? నీకే నేను మందిస్తాను. హైపెరికమ్ 200 మూడేసి మాత్రల చొప్పున రెండ్రోజులు వేసుకో. నెల్లాళ్లు పోయిన తర్వాత మళ్లా కనిపించు....''

అది అచ్చం మగవాడి స్వరం! పార్వతి గొంతుక లోంచి వస్తోంది. రామేశం ఒక్క సారి బిత్తరపోయి, నిరుత్తరుడై శాస్తుర్లు గారి వైపు చూశారు.

''అమ్మా! పార్వతిని అలా లోపలికి తీసుకెళ్లండి,'' అని శాస్త్రి గారు అనడం పార్వతి తనంతగా తనే లోపలికి వెళ్లడం జరిగిపోయాయి.

భోజనాలు అయేయనిపించి అతిథి, అభ్యాగతి మండువాలో కూర్చున్నారు. కామాక్షమ్మ వచ్చి,

''చూశారుగా! అన్నయ్యగారూ! అదీ వరస. రోజుకో భాగోతం,'' అంటూ జరిగిన న్యూనతకి అందరి తరఫునా ఆవిడే రామేశం గారికి క్షమార్పణ
చెప్పుకున్నారు.

''అబ్బాయి సరదా పడుతున్నాడు కదా అని పట్నం చదువులు చదువుకున్న పిల్లని తీసుకొచ్చి చేసేము. కోడలు వచ్చిన కొత్తలో బాగానే ఉండేది. ఈ మధ్య పుట్టింటికి వెళ్లి వచ్చింది. అప్పటి నుండి ఒకొక్క రోజు ఒకొక్క వరస. లోకేశుడికి వెరవకపోయినా లోకానికి వెరవాలి కదా. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందంటారు. ఇంటి గుట్టు రట్టయే లోగా మీరే ఏదయినా ఒక మాత్ర...''

కోడలు జబ్బు లక్షణాలు శాస్త్రి గారు, కామాక్షమ్మ గారు చెబుతూ ఉంటే రామేశం కిమ్మనకుండా విన్నారు.

అప్పటి కేమీ సమాధానం చెప్పకుండా శలవు తీసుకుని బసకి వెళ్లి పోయారు.

2

'సత్రవ భోజనం, మఠం నిద్ర' లా కాలక్షేపం చేస్తూన్న రామేశం గారు పుణ్యం పురుషార్థం అని కచేరీలో పని అయిన తర్వాత కుక్కుటేశ్వరుడి గుడి దగ్గర ఆగడం అలవాటు చేసుకున్నారు. పాదగయలో పాదాలు కడుక్కొని గుడిలోకి వెళ్లబోతూ ఉంటే,

''బాబయ్య గారూ, బాబయ్య గారూ'' అని ఎవరో పిలిచే సరికి రామేశం వెనక్కి తిరిగి చూసేరు.

శాస్త్రుర్లు గారి కోడలు పార్వతి! రామేశం అమ్మాయిని పరికించి చూసేరు.

చూడ్డానికి పిచిక లాంటి చిన్న విగ్రహం. సన్నగా, ఐదు అడుగుల మీద గుప్పెడు పొడుగు ఉంటుందేమో. విరియబోసి ఉండే జుత్తుని ఒదులు ఒదులుగా వెనక్కి లాగి రిబ్బన్‌తో కట్టి, చిన్న చట్రం లాంటి పరికరంలోనుండి ఆ మిగిలిన జుత్తుని మీదకి లాగి కిందకి ఒదిలేసేసరికి అది లాంగూలంలా – గుర్రపు తోకలా – వేలాడుతూ చూడడానికి చాలా అధునాతనంగా ఉంది. మనిషి నమ్రత చూపిస్తూ నమస్కారం పెట్టింది.

వారం రోజుల కిందట భోజనాల గదిలో చూసిన మనిషేనా అనిపించింది. సంభాషణ ఎక్కడ మొదలు పెట్టాలో ఆయనకి తెలియ లేదు. కాని దొరికిన అవకాశాన్ని ఒదులుకో దలుచుకోలేదు ఆయన.

''నాలుగు ప్రశ్నలు అడుగుతాను. సమాధానాలు చెబుతావా?''

''అడుగుతున్నారు కదా! అడగండి.''

''ఒంట్లో బాగులేక పోతే డాక్టర్‌ని చూస్తున్నావని మావ గారు చెప్పేరు. డాక్టర్ ఏమన్నాడమ్మా?''

''డయబెటీస్ అన్నారండి. ఇన్సులిన్ వాడమని 'ప్రిస్క్రిప్షన్' రాసిచ్చేరండి.''

''ఇంత చిన్న వయస్సులో డయబెటీస్ ఏమిటమ్మా. డాక్టరు అనుభవం ఉన్న వాడేనా?''

''మూర్తి గారండి. మా ఇంట్లో ఆయనే వైద్యం చేస్తారండి.''

''అమ్మా! పార్వతీ, ఎక్కువగా దాహం కానీ వేస్తూ ఉంటుందా?'' అని రామేశం మళ్లా అందుకున్నారు.

''లేదండి.''

''ఏమమ్మా, పాదాలు తిమ్మిరెక్కినట్లు కానీ, సూదులతో పొడిచినట్లు కానీ ఉంటున్నాయా?''

''లేదండి.''

''కళ్లు చీకట్లు కమ్మినట్లు ఉండడం కానీ, మసక మసకగా కనిపించడం కానీ ఉంటోందా, అమ్మా?''

''లేదండి.''

''మూర్తి రక్తం పరీక్ష చేసే చెప్పేడా, అమ్మా?''

''చేసే చెప్పేరండి.''

ఎల్లోపతి వైద్యుడు రక్తం పరీక్ష చేసి అమ్మాయికి డయబెటీస్ ఉందని చెపుతూ ఉంటే కాదనే ధైర్యం రామేశం గారికి లేదు. కానీ ఆయన కంటికి డయబెటీస్ లక్షణాలేవీ కనిపించ లేదు.

రామేశం తనకి తెలిసిన డయబెటీస్ లక్షణాలని ఒక సారి మననం చేసికొన్నారు. మనం తినే తిండిలో గ్లూకోజు అనే ఒక రకం చక్కెర ఉంటుంది. ఇది ఆహారం లోనుండి రక్తం లోనికి, అక్కడ నుండి జీవ కణాలలోనికి వెళుతుంది. ఈ గ్లూకోజు అలా జీవ కణాలలోకి చేరితే అక్కడ శక్తి ఉద్భవిస్తుంది. కాని డయబెటీస్ ఉన్న వాళ్లలో ఈ వ్యవహారం సజావుగా జరగదు. తిన్న తిండిలోని గ్లూకోజు రక్త ప్రవాహం లోనికి వెళుతుంది కాని, అక్కడ నుండి జీవ కణాలలోకి వెళ్ల లేదు. అలా చేర లేక పోవడానికి రెండు కారణాలు ఉండొచ్చు. ఒకటి, శరీరంలో ఇన్సులిన్ తయారీకి లోపం వచ్చి ఉండొచ్చు. లేదా, తయారైన ఇన్సులిన్ జీవకణాలకి అందకపోవచ్చు. కారణం ఏదయినా, పర్యవసానంగా రక్తంలో చక్కెర పాలు పెరుగుతుంది. అలా గ్లూకోజుతో చిక్కబడ్డ రక్త ప్రవాహం మందగిస్తుంది. అలా మందగించడం వల్ల వచ్చే దుర్లక్షణాలు మొట్ట మొదట శరీరపు అధిభాగపు అవయవాలలో – అంటే రక్త నాళాలు కేశనాళికలుగా మారే చోట – కనిపిస్తాయి. అందుకనే డాక్టర్లు కండ్లనీ, కంటి గుడ్డుకి వెనకాతల ఉండే అక్షిపటలాన్నీ – అంటే 'రెటీనా'నీ –, అరికాళ్లనీ, అరిచేతులనీ, నాడినీ పరీక్షించి చూస్తారు.

ఈ వ్యాధి కొంచెం ముదరడం మొదలు పెట్టగానే రక్తంలో అధికంగా ఉన్న గ్లూకోజు మూత్రంలోకి ఒలుకుతుంది. అందువల్లే ఈ వ్యాధిని మధుమూత్రం అంటారు కానీ నిజానికి మూత్రం తియ్యగా ఉండడం అనేది డయబెటీస్‌కి ఉండే అనేక లక్షణాలలో ఒక్కటి మాత్రమే. డయబెటీస్ ఉన్న వ్యక్తులు తమ రక్తం లోని గ్లూకోజు మట్టాన్ని అదుపులో పెట్ట గలిగినంత కాలం రోగం అదుపులో ఉంటుంది.

"ఏమమ్మా! నేను మూర్తితో ఒక సారి మాట్లాడి వస్తాను. నువ్వు ఇంటికి జాగ్రత్తగా వెళ్లమ్మా."

3

"రావోయ్, మూర్తీ రా" అంటూ ఇంట్లోకి వస్తూన్న మూర్తిని పలకరించి, "ఈయన రామేశం గారు, తెలుసుగా," అంటూ చిరకాల మిత్రుడిగా పరిచయం చేసేరు రామశాస్త్రి గారు.

"తెలియక పోవడం ఏమిటి?" అంటూ ముక్తసరిగా మూడు మాటలు మాట్లాడిన మూర్తి, అదే గుక్కలో, "ఏం పార్వతీ, నేను చెప్పినట్లు ఇన్సులిన్ ఇంజక్షన్‌లు రోజుకి నాలుగు సార్లు, తిండి తినే ముందు తీసుకోమని చెప్పేను. అలాగే తీసుకుంటున్నావా?"

"లేదండి. ఒక్క సారే తీసుకుంటున్నానండి."

"చెప్పిన మాట విని మోతాదు ప్రకారం మందు పుచ్చుకోక పోతే నేను మాత్రం ఏమి చెయ్యగలను? గ్లూకోజు మట్టం పెరిగిపోతే ప్రమాదం కదూ? ఏదీ ఆ చూపుడు వేలు ఇలా ఒక సారి చూపించు," అంటూ చేతిలో ఉన్న మందుల పెట్టి తెరచి అందులోంచి ఒక చిన్న సూదిని తీసి దాంతో వేలి మీద టపీ మని ఒక పోటు పొడిచేడు.

ఒకే ఒక రక్తపు బొట్టు బయటకి వచ్చింది. దానిని మందుతో లేపనం చెయ్యబడ్డ ఒక కాగితానికి అద్ది,

"ఈ 'కిట్టు' కొత్తగా అమెరికా నుండి తెప్పించేనండి" అని చెబుతూ ఆ అద్దుడు కాగితాన్ని ఒక్క నిమిషం తేరిపార పరికించి, "అరె! తమాషాగా ఉందే! మందు మోతాదు ప్రకారం పుచ్చుకోక పోయినా ఇప్పుడు రక్తంలో గ్లూకోజు 'నార్మల్' గానే ఉందే," అని ఆశ్చర్యపోతూ శాస్త్రుర్లు గారి వైపు చూసి, కొంచెం విభ్రమం ప్రకటించేడు మూర్తి.

శాస్త్రి గారు రామేశం గారి వైపు చూశారు.

రామేశం గారు మూర్తి వైపు చూసి, ''మూర్తి గారూ, గ్లూకోజు 'నార్మల్' గా ఉండడమా మీ ఆశ్చర్యానికి కారణం?'' అని అడిగేరు.

''అవునండి, నా ఆఫీసులో పరీక్ష చేసినప్పుడు 'డెసీలీటరు' రక్తంలో 250 మిల్లీ గ్రాముల గ్లూకోజు ఉంది. ఆ లెక్కని ఇది ముదిరిపోయిన డయబెటీస్. ఇప్పుడేమో ఆరోగ్యవంతులకి ఉండ వలసిన 70 కి 140 కి మధ్యలో ఉంది. పైపెచ్చు పార్వతి ఇన్సులిన్ వాడ వలసిన మోతాదులో వాడడమే లేదు. పార్వతిని మరో సారి క్లినిక్‌కి పంపించండి. రక్తం మరో సారి పరీక్ష చేసి చూస్తాను.'' అని చెప్పి మూర్తి మరేదో కేసుందని వెళ్లి పోయాడు.

పార్వతికి వచ్చిన జబ్బేమిటో శాస్తుర్లు గారికి అర్థం కాలేదు. మాటలని బట్టి డాక్టర్ మూర్తికి కూడా అర్థం అయినట్లు లేదు. రామేశం గారికి అర్థం కాలేదు. ఆయన ఏదో ఆలోచనలో మునిగి పోయారు.

4

పార్వతిలో పక్షానికో, నెలకో ఒకొక్క కొత్త లక్షణం ప్రస్ఫోటనం అవుతోంది. ఇది శారీరకమైన రుగ్మత కాదన్న నమ్మకం ఒకటి కామాక్షమ్మ మనస్సులో నాటుకు పోయిందేమో దీన వదనంతో చెబుతోంది.

''మొన్న శ్రావణ పౌర్ణమికి మావగారికి పట్టు తాపితా పట్టుకొచ్చి ఇచ్చిందండి.''

''......''

''వరలక్ష్మీ వ్రతం నాడు నాకు కూడా పట్టు చీర పట్టుకొచ్చిచ్చిందండి.''

''......''

''ఆడ పిల్ల. ఉద్యోగాలు చెయ్యడం లేదు. ఊళ్లేలడం లేదు.''

''......''

ఈ మాటలలోని నిగూఢమైన అర్థం రామేశం గారి మేధలో లీలగా స్ఫురించింది. కాని ఈ జబ్బు అసలు రూపం అర్థం అయే వరకూ మౌనమే పరమౌషధం అనుకుంటూ రామేశం గారు ఏమీ మాట్లాడ లేదు.

ఇది డబ్బు కోసం చేసే వైద్యం కాదు. స్నేహితుడి దగ్గర ముఖ ప్రీతి మాటలు చెప్పి మెప్పు పొంద వలసిన అవసరం అంత కంటె లేదు. శాస్త్రి గారిని మభ్య పెట్టి ఏవో పంచదార మాత్రలు ఇచ్చి తప్పించుకోవలసిన పరిస్థితి కూడా కాదు. అందుకని జబ్బు ఏమిటో పరిపూర్ణంగా అర్థం అయితే కాని ఆయన మందు ఇవ్వదలుచుకో లేదు.

''గాలి దోషమేమోనని అనుమానంగా ఉందండి,'' కామాక్షమ్మ మనస్సులో ఉన్న మాటని వెళ్లగక్కింది.

''.....''

''భూతవైద్యుడికి కబురంపేనండి.''

''దయ్యం అంటే నాకు అంత నమ్మకం లేదండి'' అన్నారు రామేశం, శాస్త్రి గారినీ, ఆయన భార్యనీ ఉద్దేశిస్తూ.

''ఇది ఒక దయ్యం కాదండి. దయ్యాల సంసారమే!''

రామేశం గారికి ఆ మాట అర్థం కాలేదు.

''ఎప్పుడూ ఒకే దయ్యం రాదండి. 'చిన్నక్క' అని ఒక దయ్యం ఉందండి. అదెప్పుడు వచ్చి ఆవహించినా అందరి మనస్సులూ పాడు చేసి వెళుతుందండి. ఆ రోజల్లా పార్వతి ఏడుపే, మేమూ ఏడుపే. అందరినీ అలా

ఏడిపించి వెళుతుందండి. అది వచ్చిన నాడు పార్వతికి నిద్ర ఉండదండి. మాకూ ఎవ్వరికీ నిద్రలు ఉండవండి. 'రూతమ్మ' అని ఒక కిరస్తానీ దయ్యం వస్తుందండి అప్పుడప్పుడు. అదొచ్చిననాడు ఇల్లంతా చాల సందడిగా ఉంటుందండి.''

''రోజుకో కొత్త దయ్యం వస్తూ ఉంటుందా, లేక ఎప్పుడూ ఎక్కువగా వచ్చే దయ్యం ఒకటుంటూ ఉందా?'' దయ్యం అంటే ఎంత నమ్మకం లేకపోయినా కుతూహలాన్ని చంపుకోలేక అడిగేరు, రామేశం.

''సాధారణంగా ఆవహించే దయ్యం ఒకటుందండి. అది ఈ మధ్య కొన్నాళ్లబట్టి ఎందువల్లో రాలేదు. ఈ డయబెటీస్ లక్షణాలు కనిపించడం మొదలయిన తర్వాత దాని రాక తగ్గింది.''

వాళ్ల కబుర్లకి అంతరాయం కలిగిస్తూ, సిద్ధాంతి కొడుకు ధబాల్న తలుపు తీసుకుని నాలుగిళ్ల వాకట్లోకి వచ్చేడు.

''హాఁఁఁమ్! ఫట్!! ఇదిగో చూడూ! నువ్వెవ్వర్తివే రండా!! నువ్వెవ్వర్తివో నీ చేతే చెప్పించి నిన్ను భూస్థాపితం చేస్తానే'' అంటూ రామేశంగారిని చూసి, కొంచెం తటపటాయించి, కామాక్షమ్మని ఉద్దేసించి,

''అమ్మా, తమరు ఎప్పుడు శెలవిస్తే అప్పుడు ఉపక్రమిస్తానండి''
అంటూ వాకిట్లో పీటేసుకుని కూర్చున్నాడు.

ఈ సిద్ధాంతి కొడుకుని ఊళ్లో కొంటె కుర్రాళ్లు ఉప సిద్ధాంతి అని పేరు పెట్టి వేళాకోళం చేస్తూ ఉంటారు. కాని అతగాడు భైరవుడు, వీరభద్రుడు, మొదలైన ప్రచండ దేవతలని ఆరాధించి, భైరవ కాపాలిక తంత్రాలు నేర్చుకున్న భూతవైద్యుడునని చెబుతాడు. ఈ ఉప సిద్ధాంతి పిఠాపురంలో 'ప్రేక్టీసు' పెట్టిన తర్వాత దయ్యాలు, కామినీలు ప్రజలకి కనిపించడం ఎక్కువయిన మాట మాత్రం వాస్తవం.

''అయితే ఇది దయ్యమే నంటారా?'' రామేశం గారే సిద్ధాంతిని కదిపేరు.

''అమ్మమ్మ! ఇది మామూలు దయ్యం కాదు, బాబు గారూ. ఇదెవరో మీ ముందే చెప్పిస్తానండి.''

అని చెప్పి, ఉప సిద్ధాంతి,

''శ్రీకరంచ పవిత్రంచ శోక రోగ నివారణం,
లోకే వశీకరం పుంసాం భస్మం త్రైలోక్య పావనం''

అంటూ ఒడలంతా భస్మం పులుముకున్నాడు. తర్వాత

''గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసం
హ్రాం, హ్రీం, హ్రూం, హ్రైం, ''

అంటూ ముక్కు పొడుం ఒక పట్టు పట్టి, 'ఢుర్' మంటూ గట్టిగా ఒక పిల్పు పిల్చి దయ్యాలని భయపెట్టడానికి శరభసాళ్వం అనే మంత్రాన్ని గొంతెత్తి పఠించడం మొదలు పెట్టేడు, మన ఉప సిద్ధాంతి.

రానని మారాం చేస్తూన్నా వినకుండా పార్వతిని బలవంతంగా తీసుకు వచ్చి ఉప సిద్ధాంతి ఎదుట కూర్చోబెట్టేరు. వాళ్లేమిటి చేస్తున్నారో అందరికీ కనిపించకుండా భూత వైద్యుడు చుట్టూ తెర కట్టేసేడు. భూతాన్ని బయటకి రమ్మని నయాన్నా, భయాన్నా చెప్పి చూసేడు. భూస్థాపితం చేస్తానని బెదిరించేడు. ఏమిటి కావాలో చెప్పు అని బుజ్జగించేడు. ఈ భూతవైద్యుడి అరుపుల మధ్య పార్వతి ఏమంటున్నాదో ఎవ్వరికీ సరిగ్గా వినిపించడం లేదు. ఇలా ఒక అరగంట జరిగింది ఈ తంతు.

ఆఖరికి ఉప సిద్ధాంతి విజయ గర్వంతో తెర తొలగించి బయటకి వచ్చేడు. కొంచెం గొంతుక తగ్గించి,

''బాబూ, తమరికి జ్ఞాపకం ఉందో లేదో. చాలా కాలం నాటి సంగతి. మా నాన్న చెబుతూ ఉంటే విన్నాను....''

అని కొంచెం దగ్గరకి జరిగి, ఇంకా గొంతుక తగ్గించి,

''... మన ఊళ్లోనే ఒక పెద్దోరి లోగిట్లో ఒక ఖూనీ జరిగిందండి. మనిషిని 'మర్డరు' చేసేసి, ముక్కలుగా కోసేసి, ట్రంకు పెట్లో పెట్టేసి, ఆ పెట్టెని హౌరా మెయిలు ఎక్కించేసేరండి. ఆ రోజుల్లో పిఠాపురంలో మెయిలు ఆగేది లెండి. బండి బరంపురం చేరుకునే సరికి ట్రంకు పెట్టెలో శవం సంగతి గుప్పుమని పోయిందిటండి. 'ట్రంకు మర్డరు కేసు' అని పేపర్లలో పాక్కి పోయిందండి. దరిమిలా బరంపురం కోర్టులో విచారణ జరిగిందండి. వాఙ్మూలానికి మన రిజిష్టారు ఆఫీసునుండి మనిషిని కూడా పంపించేరండి. ఈ కథంతా మా నాన్న చెబుతూ ఉండేవాడండి...''

అని చెప్పి, మళ్లా వెనక్కి జరిగి, గొంతుక మామూలు స్థాయికి పెంచి,

''ఆ ఆసామీయేనండి మన పార్వతమ్మని పూనిందండి.''

'ట్రంకు మర్డరు కేసు' లో వాఙ్మూలం ఇవ్వడానికి పిఠాపురం రిజిష్టారు ఆఫీసునుండి బరంపురం వెళ్లిన మనిషి మరెవరో కాదు. మన రామేశం గారే! ప్రభుత్వం వారు పోలీసు 'ఎస్కార్టు' ఇచ్చి మరీ పంపించేరు. కనుక ఆ వివరాలన్నీ రామేశం గారికి తెలుసన్న విషయం మన ఉప సిద్ధాంతికి తెలిసుండక పోవచ్చు.

''శాస్త్రిగారికి పట్టు తాపితాని, అమ్మగారికి పట్టు చీరని ఎక్కడ కొని పట్టుకొచ్చిందో కనుక్కోండి'' రామేశం అడిగేరు.

ఉప సిద్ధాంతి తెర వెనకకి వెళ్లి, కొంత సేపటిలో తిరిగి వచ్చి, అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పడం మానేసి,

''శాస్త్రిగారి సంసారంతో స్నేహం చెయ్యడానికి వచ్చిందిటండి. ఈ బ్రహ్మరక్షసి. పట్టుబట్టలే కాదు, కావలిస్తే నగలు, డబ్బు కూడా పట్టుకొచ్చి ఇస్తానంటోందండి. మీరే అడగండి, మీకే చెపుతుంది'' అని ప్రోత్సాహ పరచి, పార్వతిని తీసుకొచ్చి ఎదురుగా నిలబెట్టేడు ఉప సిద్ధాంతి.

మునపటి పార్వతి వేరు, ఇప్పటి పార్వతి వేరు అని ఎవ్వరేనా చెప్పగలరు. కుక్కుటేశ్వరుడి కోవెల దగ్గర చూసిన మనిషిని మాయాబజారు సినిమాలోని అసలు శశిరేఖ అనుకుంటే, ఈ రోజు చూస్తూన్న మనిషి దొంగ శశిరేఖలా అనిపించింది. ఆ నడక, ఆ వయినం, ఆ మాట తీరు, అంతా మరొక మనిషే.

రామేశం గారి బుర్రలో ఆలోచనలు జోరుగా పరిగెడుతున్నాయి. ఆయనకి దయ్యాలంటే నమ్మకం లేదు. ఉప సిద్ధాంతి 'ఇది దయ్యమే' అని చెప్పి దాని పేరు, చిరునామాతో సహా చెబుతున్నాడు. ఈ సందర్భంలో తను ఏం మందు వేస్తాడు? ఏ రోగానికని వేస్తాడు? దయ్యాన్ని వదలగొట్టించడానికి హోమియోపతీ వైద్యం చేసేడని ప్రజలు వేళాకోళం చెయ్యరూ? దయ్యం పట్టిన పిల్లకి ఏ మందని ఇవ్వడం?

కాని డయబెటీస్ అదుపులోకి రావాలంటే ముందు ఈ దయ్యం వదలాలి. అప్పుడేనా డయబెటీస్ లాంటి రోగాన్ని మూర్తి వంటి ఎల్లోపతీ వైద్యుడి చేతుల్లో ఉంచడమే సర్వత్రా శ్రేయస్కరం. కాని రామేశం గారిని మథన పెడుతూన్న విషయం ఏమిటంటే పార్వతిలో తనకి మచ్చుకి ఒక్క డయబెటీస్ లక్షణం కనిపించ లేదు. మూర్తి

అందరి ఎదటా చేసిన అద్దుడు కాగితం పరీక్షలో కూడ డయబెటీస్ లేదనే తేలింది. మూర్తి ఆఫీసులో చేసిన రక్తపు పరీక్షలో పప్పులో కాలేసేడనుకుందికి వీల్లేదు; సాధారణంగా ఇటువంటి సందర్భాలలో రక్తం మచ్చు తీసే వరకే డాక్టరు బాధ్యత; తర్వాత పరీక్షలన్నీ ప్రయోగశాలలో అనుభవజ్ఞులే చేస్తారు.

లక్షణాలలో పొత్తు కుదరలేదేమిటా అని ఇలా మధన పడుతూ, శాస్త్రుర్లు గారి వైపు మరేమీ కంగారు పడద్దన్నట్టు చేతితో చిన్న సంజ్ఞ చేసి, పార్వతి వైపు చూస్తూ, రామేశంగారు గొరైపోతు గాంభీర్యం ప్రకటిస్తూ, కొంచెం కఠినంగానే మాట్లాడేరు.

''నువ్వు ఎవరివయితే మాకెందుకు. మా పిల్లకి అసలే సుస్తీగా ఉంది. నువ్వు వదలిపెట్టి వెళ్లిపోతే మా పిల్లకి మా మందులు మేము వేసుకుంటాం. నువ్వు ఇలా పట్టుకు వేళ్లాడుతూన్నంత సేపూ నీ ప్రభావం ఏమిటో, రోగ లక్షణాలు ఏమిటో విడదీసి చెప్పడం కష్టంగా ఉంటోంది. నయాన్న చెప్పి చూస్తున్నాను. వినకపోతివా నా దగ్గర ఉన్న ఒక హోమియోపతీ మందు వేసేనంటే నువ్వు, నీ తాత దిగొస్తారు. నా తడాఖా నీకు ఇంకా తెలియదు.''

''నాకు హోమోపతీ వద్దు. ఎల్లోపతీ వద్దు. ఏ పతీ వద్దు. తిరుపతీ కావాలి.''

ఈ ధోరణి ఎవ్వరికీ అర్థం కాలేదు. తెల్లబోయి చూస్తున్నారంతా.

''నా చేత తిరుపతి యాత్ర చేయించండి. హరిద్వారం, హృషీకేశం తీసికెళ్లండి. గయలో పిండ ప్రదానం చేయించి కాశీ యాత్ర చేయించండి. కాశీలో గంగలో మునగగానే నేను పార్వతి శరీరం వదలిపెట్టి వెళ్లి పోతాను. అంత వరకు ఎవ్వరికీ ఏమీ హాని చెయ్యను.''

రామేశం గారి కుతూహలం పెరిగింది. కొంచెం ధైర్యం కూడ వచ్చింది.

''నేను మీ ఇంటికి మొట్టమొదట సారిగా వచ్చిన రోజున భోజనం చేస్తూన్నప్పుడు నాతో మాట్లాడినది నువ్వేనా?''

''....''

''లేదండి. నేను పిలవగా ఇప్పుడే వచ్చిందండి.'' అంటూ భూతవైద్యుడు మధ్యలో కలుగజేసుకున్నాడు.

''అంటే ఇరవై నాలుగు గంటలూ నువ్వు ఆవహించి ఉండవా?''

''....''

''ఉండదండి. ఆ జట్టులో మరెవరైనా ఆవహించవచ్చండి.'' మన ఉప సిద్ధాంతి పుల్లారి బుడ్డిలా మరొక మాట అందిస్తూన్నా వినకుండా,

''నీ జట్టులో ఎంతమంది ఉన్నారేమిటి?''

''....''

''చాల మంది ఉన్నారండి బాబూ.''

ఈ ఉప సిద్ధాంతి మధ్యలో జోక్యం కలుగజేసుకోకుండా ఉంటే రామేశంగారికి మరొక రెండు ప్రశ్నలు అడగాలని చాల ఉబలాటంగా ఉంది. 'ట్రంకు మర్డరు కేసులో కోర్టు వారి తీర్మానం సంగతి అలా ఉంచి, నిజంగా హంతకుడెవరు?' అన్నది ఒక ప్రశ్న. 'ఊళ్లో ఇంతమంది ఉండగా శాస్త్రుర్లు గారి ఇంటికే ఎందుకు వచ్చేవు?' అన్నది రెండవ ప్రశ్న. కాని ఇలాంటి కుతూహలపు ప్రశ్నలు వేసి కాలహరణం చేసే లోగా, ముఖ్యమైన ప్రశ్నలు ముందు అడగవలసినవి ఉన్నాయి. సిద్ధాంతిని మాట్లాడవద్దని సైగ చేస్తూ,

''నెల్లాళ్ల కిందట పార్వతి డయబెటీస్ పరీక్ష చేయించుకుందికి వెళ్లినప్పుడు నువ్వు ఆవహించి ఉన్నావా?''

''లేను.''

''అప్పుడెవరు వచ్చేరో చెప్పగలవా?''

''తెలియదు.''

''తెలుసుకుని ఆ వ్యక్తిని ఒక సారి పంపుతావా?''

''అలాగే.''

''దేశంలో ఇంతమంది ఉండగా వీరింటికే ఎందుకు వచ్చింది మీ దయ్యాల దండు?''

''శాస్త్రిగారు పరమ నిష్ఠాగరిష్ఠులు. సరస్వతీ పుత్రులే కాకుండా లక్ష్మీ కటాక్షం ఉన్న వారు. నాకు కావలసిన యాత్రలు, కర్మ కాండ శాస్త్రోక్తంగా జరిపించ గల సమర్థులు. శాస్త్రిగారింటికి కాకుండా నీ ఇంటికి వస్తే నువ్వేమి చెయ్యగలవు? జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలిందన్నట్లు నీ ఇంటికి వస్తే హోమియోపతీ మందిస్తానంటావు. అంతేగా? ఇంక చాలు. నేను వెళతాను.''

ఇక పార్వతిని అట్టే ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక అందరూ ఆ రాత్రికి సమావేశం అయిందనిపించేరు. వేళ మించిపోయిందని శాస్త్రిగారి బలవంతం మీద రామేశం వారింట్లోనే నడ్డి వాల్చడానికి నిశ్చయం చేసేరు.

అర్థరాత్రి దాటినా రామేశం గారికి నిద్ర పట్ట లేదు. దయ్యాలంటే ఎంత నమ్మకం లేక పోయినా, అకస్మాత్తుగా నిశి రాత్రి వేళ దయ్యం మళ్లా వస్తేనో అన్న అనుమానపు అంకురం పట్టుకుని పీడించడం మొదలు పెట్టింది. పడుక్కున్న పార్వతిని లేవగొట్టి దయ్యం పీడించడం ఇంత వరకూ ఎప్పుడూ జరగలేదని శాస్త్రిగారు చెప్పిన తర్వాత మూడు కునుకులు తియ్యడానికి ప్రయత్నం చేసేరు రామేశం.

కోడి కూసే లోగానే లేచి కాలకృత్యాలు పూర్తిచేసి, దగ్గర ఉన్న హానిమాన్ రాసిన పుస్తకం ఒకటి తీసి పుటలు తిరగెయ్యడం మొదలు పెట్టేరు రామేశం. తను శాస్త్రిగారింటికి మొదటిసారి వచ్చిన నాడు రాత్రి, భోజనాల వేళప్పుడు పార్వతి 'హైపెరికమ్ 200 మూడేసి మాత్రల చొప్పున రెండ్రోజులు వేసుకో' అన్న మాటలు ఇప్పటికీ ఆయన చెవులలో మోగుతున్నాయి. హైపెరికమ్ అన్న పేరు ఉన్న చోట ఆగి దాని గురించి చదవడం మొదలు పెట్టేరు.

''దెబ్బ తగిలితే వెనువెంటనే వాడే మందులలో ఆర్నికాకి అగ్ర తాంబూలం ఇవ్వాలి. తర్వాత హైపెరికమ్. దెబ్బ కండరాలకి తగిలితే ఆర్నికా, నరాలకి తగిలితే హైపెరికమ్.''

మెదడంతా నరాల కుప్ప కనుక మెదడుకి దెబ్బ తగిలినా హైపెరికమ్ వాడొచ్చా? మనస్సుకి దెబ్బ తగిలితే?

'' 'హైపెరికమ్ పెర్ఫొరేటమ్' ఒక పువ్వుల మొక్క. చూడ్డానికి కొంచెం పచ్చ మందారలా ఉంటుంది. సుమారు 2000 సంవత్సరాల కిందటే గ్రీకులు దీనిని దయ్యాలని తరమగొట్టడానికి ఔషధంగా వాడేవారట!'' ఇది చదువుతూ ఉంటే రామేశం గారి హృదయ స్పందన లయ తప్పినట్లయింది.

ఇంతలో కోడలు వచ్చిన తర్వాత కాఫీ కాచడం నేర్చుకున్న కామాక్షమ్మ రామేశం గారికి కాఫీ పట్టుకొచ్చి ఇచ్చేరు. తత్పరతతో కాఫీ తాగుతూ, రామేశం గారే అన్నారు.

''యాత్రలు చేయించి, శాంతి చేయించడంలో నష్టం ఏమీ కనిపించడం లేదు.''

రామేశంగారి వాలకంలో వచ్చిన మార్పుని గమనించి, నమ్మలేక, ''అయితే ఇది దయ్యమే అంటారా?'' అని శాస్త్రి గారు అడిగేరు.

''ఉప సిద్ధాంతి దయ్యం అంటున్నాడు. పార్వతీ అలాగే ప్రవర్తిస్తోంది. కామాక్షమ్మగారికి అలాగే అనిపిస్తోంది. ఏ పుట్టలో ఏ పాముందో. మూర్తికి మరొక సారి చూపించి రక్తం మరొక సారి పరీక్ష చేయించండి. ఈ వారం తుని వెళ్లి మరికొన్ని పుస్తకాలు సంప్రదించి కొంచెం ఆలోచించి చెపుతాను,'' అన్నారు రామేశంగారు.

౬

గతుకుల రోడ్డు మీద బస్సు నెమ్మదిగా వెళుతోంది. రామేశం గారి బుర్ర పంజాబు మెయిల్లా పరిగెడుతోంది. తన అనుభవంలో ఇటువంటి కేసు ఎక్కడా కనిపించ లేదు. పార్వతికి ఒక్క దయ్యం పట్టిందంటే నమ్మ వచ్చు కానీ, ఇన్ని దయ్యాలు ఒక దాని తర్వాత మరొకటి చుట్టపు చూపుల్లా పట్టి విడుస్తున్నాయంటే నమ్మదగ్గ విషయంలా లేదు. తను చూడడం మొదలు పెట్టిన మూడు నెలల లోనూ మూడు దయ్యాలు పట్టి వదిలేయి. దయ్యం పట్టినప్పుడల్లా పిల్ల ఇన్సులిన్ వాడడం మానేస్తూందేమోనని ఒక అనుమానం ఆయనని పీడిస్తోంది. ఈ దయ్యాలన్నీ వదలి వెళితే అప్పుడు డయబెటిస్ సంగతి ఆలోచించాలి. ఈ డయబెటీస్ తీర్థయాత్రలు చేస్తూ ఉండగా విజృంభిస్తే ప్రమాదం కూడాను.

కామాక్షమ్మ గారి కథనాన్ని బట్టి కొన్ని సరదాగా, సందడిగా, కలివిడిగా  కాలం గడిపే దయ్యాలు, కొన్ని ఇంటిల్లిపాదినీ విచార గ్రస్తం చేసే దయ్యాలు. ఒకొక్క దయ్యమే ఒకొక్కసారి ఆవహిస్తోంది.

ఇలా ఆలోచనలు పరి పరి విధాల పోతూన్న సమయంలో రామేశం గారి  మస్తిష్కంలో అసలు 'దయ్యం' అంటే ఏమిటా అని అనుమానం వచ్చింది. గాలి, దయ్యం, కొరివి దయ్యం, భూతం, కామినీ, పిశాచం, బ్రహ్మ రక్షసి, ఇలా ఎన్నో రకాలు ఉన్నాయి. ఒక గురువు తనకి వచ్చిన విద్యని శిష్యపరంపరకి అందజెయ్యకుండా చచ్చిపోతే ఆ మనిషి బ్రహ్మరక్షసి అవుతాడంటూ– అడగని వాళ్లది పాపం – ద్రాక్షారం బ్రహ్మరక్షసి కథ చెప్పేవారు. కామేచ్ఛ తీరకుండా చచ్చిపోయిన ఆడవాళ్లు కామినీలు అవుతారంటూ సింహాచలం కామినీ కథ చెప్పేవారు. ఇలాగే గంగలకుర్రు అగ్రహారంలో కొరివి దయ్యాల కథ, కాశీ వెళ్లి బ్రహ్మరక్షసి దగ్గర వ్యాకరణం నేర్చుకున్న వీరభద్రశాస్త్రి కథ, ... ఇలా దయ్యాల గురించి ఇన్నేసి కథలున్నా ఎవ్వరూ ఖరాఖండిగా దయ్యం అంటే ఇది అని నిర్వచించిన పాపాన పోలేదు.

కొన్ని రకాల దయ్యాలు మనుష్యుల రూపం ధరించి కనిపిస్తాయిట. అలాగని అందరికీ కనిపించవు. దేవ గణంలో పుట్టిన మనుష్యులకి దయ్యాలు       ఎప్పుడూ కనిపించవు; రాక్షస గణంలో పుట్టిన వాళ్లకే కనిపిస్తాయంటారు. ప్రత్యక్షంగా కనిపించక పోయినంత మాత్రాన దయ్యాలు లేవనడానికి వీలులేదు. అనుమాన ప్రమాణాలు ఉన్నాయి కదా!

కనిపించినది దయ్యమో కాదో నిర్ధారణ చేసుకోడానికి ధ్రువీకణ పరీక్ష ('కన్ఫర్మేషన్ టెస్ట్') ఒకటి ఉంది. దయ్యం పాదాల వైపు చూస్తే అవి వెనక్కి తిరిగి ఉంటే అది దయ్యం అని నిర్ధారణ.  కొన్ని రకాల దయ్యాలు మనిషి రూపంలో కనిపిస్తాయి. ఇవి ఆడదాని రూపంలో కనిపిస్తే వీటిని కామినీలు అంటారు. మగ రూపంలో కనిపించే దయ్యాలని రక్షసి అంటారుట. బ్రాహ్మణ దయ్యం అయితే బ్రహ్మరక్షసి. వ్యాకరణం సుబ్రహ్మణ్యశాస్త్రికి కాశీలో కనిపించినదీ, ద్రాక్షారం నవాబు సంసారాన్ని పట్టుకున్నదీ ఇటువంటి బ్రహ్మరక్షసులే.

కొన్ని దయ్యాలకి రూపం అంటూ ఏమీ ఉండదు; అవి మరొక మనిషి శరీరంలో ప్రవేశించే వరకూ అవి ఉన్నా యన్న సంగతే మనకి తెలియక పోవచ్చు. అప్పుడు వాళ్లకి దయ్యం పట్టిందని కానీ, ఆవహించిందని కాని అంటాం. కొరివి దయ్యాలు ఎవ్వరినీ ఏమీ చెయ్యవు. అవి రాత్రి పూట కాగడాలు వేసుకుని వాటి మానాన అవి తిరుగుతూ ఉంటాయి. వాటిని చూసి మనం భయ పడితే దానికి అవి బాధ్యులు కావు.

చచ్చిపోయిన మనుషులు కొందరు దయ్యాలు అవుతారన్నది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నమ్మకం. చచ్చిపోయిన మనిషి శరీరాన్ని ఖననమో, దహనమో చేసేస్తాము కనుక మిగిలిపోయిన ఆత్మే దయ్యం అవాలి మరి. ప్రాణం లేని శరీరం ప్రేతం. శరీరం లేని ఆత్మ దయ్యం. ఆత్మ పరబ్రహ్మ స్వరూపం అంటారు. అంటే దయ్యం పరబ్రహ్మ స్వరూపమా? దేవుడు ప్రకృతి. దయ్యం వికృతి. తన తర్కానికి తనకే నవ్వు వచ్చింది.

''బాబు గారు ఎందుకో నవ్వుకుంటునారు.'' బస్సులో పక్కనున్న బొద్దు మీసాల ఆసామీ అన్నాడు.

''మీరు ఎప్పుడైనా దయ్యాన్ని చూసేరా?''

''దెయ్యాలు అందరికీ కనిపించవు బాబూ, నా హోలైపులో నాక్కనిపించలేదండి.''

''పోనీ, దయ్యం పట్టిన మనిషిని ఎప్పుడేనా ఎవ్వరైనా చూసేరా?''

''చూడకేం బాబూ. రోజా సూత్తానే ఉన్నం కదండీ. ఎలకషన్ల ముందు మన రాజకీయ నాయకులు పూనకం వచ్చినోళ్లలా పవర్తిల్లి, ఎన్నికలు అయిపోంగానే ఘూత్తాపితం అయినట్లు ఫికర కుండా పోతరు కదండీ. ఆళ్లే దెయ్యాలు. దొంగ నాయాలు.'' పిలవని పేరంటంలా మరొక ప్రయాణీకుడు వంత పాడేడు.

''రాజకీయ నాయకుల సంగతి మనకెందుకు కానీ దయ్యం పట్టిన మనిషిని ఎప్పుడేనా చూసేరా?''

''బాబూ! నేను ఏదాంతం సెపుతునాననుకోమాక. ఒక్క సింగిలు ఇసయం సెబుతా. దేవుడే అను. దెయ్యమే అను. అదంతా మన మనసులో ఉంది. నాకెప్పుడూ దేవుడూ కనిపించ లేదు, దెయ్యమూ కనిపించ లేదు. కనిపించకపోయినా నమ్మకం నమ్మకమే నండి.''

బస్సులో రామేశం గారు కూర్చున్న చోట ప్రయాణీకులలో చిన్న సంచలనం చెలరేగింది.

ఇలా మాట్లాడుతూ ఉండగా ఎప్పుడో ఎక్కడో ఏదో పుస్తకంలో చదివిన విషయాలు కొన్ని మనస్సులో ఒక్క సారి మెదిలేయి రామేశం గారికి. నిజమే! దయ్యం అనేది మన మనస్సులో ఉన్న భావనే. కాశీ వెళితేనూ, శాంతి చేస్తేనూ అవి పోతాయన్నది కూడా మన మనస్సులలో పాతుకు పోయిన భావనే. యద్భావం తద్భవతి.

కొన్ని రకాల మానసిక రోగాలలో ఒకే వ్యక్తి శరీరంలో రకరకాల వ్యక్తిత్వాలు దాగి ఉంటాయని రామేశం గారికి తెలుసు. డాక్టర్ జెకిల్, మిస్టర్ హైడ్ కథ దీనికి ఒక ఉదాహరణ. ఒకడు మంచివాడు, రెండవ వాడు చెడ్డవాడు. ఇద్దరూ ఒకే శరీరంలో ఉండేవారు. ఈ ఇద్దరిలోనూ ఒకడు మామూలు మనిషి, రెండవ వాడు దయ్యం పట్టిన మనిషి అనుకుంటే సరిపోలేదూ? దయ్యం పట్టడానికి పరకాయ ప్రవేశానికి పెద్ద తేడా లేదు. దయ్యం బతుకున్న వాళ్ల శరీరాలలో ప్రవేశిస్తుంది. పరకాయ ప్రవేశంలో ఆత్మ చచ్చిపోయిన దేహంలో ప్రవేశిస్తుంది.

హిచ్‌కాక్ తీసిన "సైకో" సినిమాలో ఇద్దరు మానసిక వ్యక్తులు ఒకే వ్యక్తి బొందిలో ఉంటారు. ఎవరు ప్రకోపిస్తే వాళ్ల మనస్తత్వం ఆ వ్యక్తిలో బహిర్గతమవుతుంది. రెండవ వ్యక్తిత్వం అంతర్గతంగా ఉండిపోతుంది. ఇవన్నీ పుస్తకాలలో కథలు, సినిమాలలో కథలు అయినప్పటికీ ఈ పోకడని పోలిన సిద్ధాంతాలు జీవశాస్త్రంలో

లేకపోలేదు. ఒకే తల్లి పిల్లలలో కొందరికి నల్ల కళ్లు, కొందరికి పిల్లి కళ్లు బహిర్గత అంతర్గత జన్యువుల ప్రభావం వల్ల వచ్చి నట్లే, మానసికంగా ఒకే శరీరంలో బహిర్గత అంతర్గత వ్యక్తిత్వాలు ఎందుకు ఉండకూడదు? ఈ రకం ఆలోచన ఆధునిక విజ్ఞాన పరంగా స్వీకరించడానికి వీలవుతుందో లేదో రామేశం గారు చెప్పలేరు. ఆయనకి ఈ రంగంలో శిక్షణా లేదు. అనుభవమూ లేదు.

శరీరానికి కాదు మనస్తత్వానికి మందివ్వాలని హోమియోపతీ వైద్య శాస్త్రం పోరు పెడుతోంది. పైకి ఎన్ని విభిన్న లక్షణాలు కనిపించినా వాటన్నిటికి అనువైనది ఒకే ఒక మందు ఉంటుందని హోమియోపతీ వైద్యశాస్త్రం ఉద్ఘోషిస్తోంది. అనుభవజ్ఞుడైన వైద్యుడైతే ఆ మనస్తత్వానికి సరితూగే ఆ ఒక్క మందుని ఎంచి వాడతాడు. అలా ఎంపిక చేసిన మందు సరియైనదైతే నిమిషాల మీద గుణం కనిపిస్తుంది. కాని ఒకే శరీరంలో ఎన్నో మనస్తత్వాలు బందీ అయి, ఒకొక్కటి ఒకొక్క సమయంలో బయట పడుతూ ఉంటే ఏ మనస్తత్వానికి మందు ఇవ్వడం?

ఇలా ఆలోచిస్తూ ఉంటే రామేశం గారి మేధకి ఒక గమ్మత్తు అయిన ఆలోచన తట్టింది. పార్వతికి తను చూస్తూ ఉండగా డయబెటీస్ లక్షణాలు కంచు కాగడా వేసి వెతికినా కనబడలేదు. కాని తను తన ఆఫీసులో చూసిన పార్వతిలో కచ్చితంగా డయబెటీస్ కనిపించిందని మూర్తి చెబుతున్నాడు. మూర్తి చెప్పేదే నిజం అయితే మూర్తి మొదట చూసిన పార్వతి వేరు. తనతో తర్వాత చూసిన పార్వతి వేరు. విగ్రహం ఒకటే కావచ్చు. ఆ విగ్రహంలో ఉన్న వ్యక్తులు వేర్వేరు కావచ్చు.

దయ్యాల పరిభాషలో చెప్పాలంటే ఆవహించిన దయ్యానికి ఏ జబ్బు ఉంటే అవహించబడ్డ మనిషిలో ఆ లక్షణాలు పొడచూపుతాయన్న మాట. వైద్య పరిభాషలో చెప్పాలంటే శరీరాన్ని ఏ మనస్తత్వం ఏలుతూ ఉంటే ఆ మనస్తత్వానికి సరిపడే మందు వాడాలి. శరీరం నుండి అన్ని మనస్తత్వాలనీ పారదోలేస్తే శరీరానికి శవానికి తేడా లేదుగా. కనుక పార్వతి శరీరంలో శాశ్వతంగా ఒక మనస్తత్వాన్ని అట్టే పెట్టి, మిగిలిన వాటిని పారదోలాలి. అలా అట్టే పెట్టిన మనస్తత్వానికి డయబెటీస్ లేకుండా జాగ్రత్త పడ్డామంటే ఒకే దెబ్బకి రెండు పిట్టలు తార్ మంటాయి; దయ్యాలూ పోతాయి, డయబెటీసూ పోతుంది.

ఆలోచనా సరళి, తర్కం బాగానే ఉన్నాయి కాని ఇవన్నీ ఊహాగానాలు. గాలి మేడలు. సిద్ధాంతాలు. ఈ సిద్ధాంతాలకి ఆధారభూతమైన ప్రమాణాలేమయినా ఉన్నాయా?

బస్సు తుని పొలిమేరలలోకి వచ్చింది. రామేశం గారి కొడుకూ, రాఘవాచార్యులి కొడుకూ రాజా హైస్కూల్లో కలిసి చదువుకున్నారు. రాఘవాచార్యులి కొడుకు తర్వాత వైజాగ్‌లో యమ్.బి.బి.యస్. చదివి ఢిల్లీలో 'పోస్టు గ్రేడ్యుయేటు' చదివి ఈ మధ్యనే తిరిగి తుని వచ్చేడు. ఈ రకం ప్రశ్నలకి కాలేజీ నుండి కొత్తగా బయట పడ్డ కుర్రాళ్లకి సమాధానాలు బాగా తెలుస్తాయి.

బస్సుని మార్కండ్రాజు పేటలోని పెట్రోలు బంకు దగ్గర ఆపించి దిగిపోయేరు రామేశం. అక్కడ నుండి నాలుగడుగులు వేస్తే కృష్ణమాచార్యుల ఇల్లు. అదే క్లినిక్ కూడా. రామేశం గారిని గుర్తు పట్టిన ద్వారపాలకుడు ఆయనని నక్షత్రకుడిలా అడ్డెయ్యకుండా లోపలికి పంపించేడు.

కేసు వివరాలు పూర్తిగా చెప్పకుండా ఆయనకి కావలసిన ప్రశ్న ఒకటి అడిగేరు.

కృష్ణమాచార్యులు వెంటనే ఆ లక్షణాలని గుర్తు పట్టి,

''రామేశం గారూ! మీరు చెప్పిన లక్షణాలని సినిమాల్లోనూ, కథల్లోనూ 'మల్టిపుల్ పెర్సనాలిటీ డిసార్డర్' అని పేరు పెట్టి పెద్ద హంగామా చేస్తూ ఉంటారు. ఇదంతా మన తరం 'హిస్టీరియా' అనుకొండి,'' అని తను వేసిన జోకుకి తనే నవ్వుకున్నాడు.

''పసందుగా కనిపించే కథా వస్తువే కాని, 'మల్టిపుల్ పెర్సనాలిటీ డిసార్డర్' నిజ జీవితంలో చాల అరుదు. మీరు చెప్పే రోగ లక్షణాలని మేమైతే 'మేనిక్ డిప్రెసివ్ ఇల్‌నెస్' అంటాం. రోగి చిన్న వయస్సులో మానసికమైన క్షోభ అనుభవించిన కారణంగా కాని, ఆ క్షోభని బయటికి వెళ్లగక్కలేక లోపల అణచి పెట్టుకోవడం వల్ల కాని ఇటువంటి రోగ లక్షణాలు పొడచూపుతాయి. ఈ జబ్బుతో బాధ పడేవారు ఒక రోజు సంతోషంగా ఉంటారు. మరొక రోజు విచారంగా ఉంటారు. ఒకొక్క రోజు నిద్ర పట్టదు. మరొక రోజు కారణం లేకుండా భోరుమని ఏడుస్తారు. మనందరికీ ఉండే సంఘభీతి వీరికి ఉండదు. కావాలనుకుంటే మీరు 'మల్టిపుల్ పెర్సనాలిటీ డిసార్డర్' అన్న పేరునే వాడండి. ఆ సిద్ధాంతమూ ఉంది,'' అంటూ ఒక మెడికల్ పత్రిక తీసి నాలుగు వాక్యాలు చదివి వినిపించడం మొదలు పెట్టేడు డాక్టర్ కృష్ణమాచార్యులు –

''ప్రకోపించిన మనస్తత్వాన్ని బట్టి భౌతికంగా రోగ లక్షణాలలో మార్పు కనిపించవచ్చు. కొందరికి శరీరంలో శాల్తీ మారేటప్పటికి 'బ్లడ్ ప్రెషర్' లోనూ, 'ఇ. కె. జీ.' లోనూ కూడ మార్పులు కనిపిస్తాయి.''

''రక్తంలో ఉండే గ్లూకోజు మట్టంలో కూడ మార్పు కలిగే సావకాశం ఉందంటారా?'' రామేశం అడిగేరు.

''అలాగని ఈ పత్రికలోని పరిశోధకుడు రాయలేదు. 'బ్లడ్ ప్రెషర్' లోనూ, 'ఇ. కె. జీ.' లోనూ మార్పులు కనిపించినప్పుడు గ్లూకోజు మట్టంలో మాత్రం ఎందుకు ఉండకూడదు?''

''కాశీ యాత్ర చేయించమని రోగి అడుగుతోంది. దాని వల్ల లాభం ఉంటుందా?''

''ఈ రకం కేసులలో కాశీ యాత్ర లాంటి చిటకాలకి, మీ హోమియోపతీ వైద్యానికి కొంత పోలిక ఉంది. కాశీ యాత్ర చేయించినా, హోమియోతీ మాత్ర వేసినా హాని కలుగదు. మేలు కలిగితే కలగొచ్చు. పంపించి చూడండి. 'సైకయాట్రిస్టు'కి కూడ ఒక సారి చూపించండి.''

డాక్టర్ కృష్ణమాచార్యులుకి ధన్యవాదాలు చెప్పి, వీధిగుమ్మం వరకూ వచ్చి, ఒక్క లిప్త మాత్రపు కాలం తటపటాయించి, మళ్లా వెనక్కి తిరిగి, ''నాయనా, నీకు హైపెరికమ్ గురించి ఏమైనా తెలుసా?''

కృష్ణమాచార్యులు పడ్డ ఆశ్చర్యానికి అంతు లేదు. వెంటనే రామేశం గారిని తిరిగి లోపలికి తీసుకెళుతూ, ''రామేశం గారూ, హైపెరికమ్ గురించి మీకు ఎలా తెలుసు?''

''ఎలా తెలుసని అడుగుతావేమిటోయ్! హైపెరికమ్ ప్రసిద్ధమైన హోమియోపతీ మందు.''

''అలాగా! చూడండి,'' అని బల్ల మీదున్న వారపత్రికని ఒకదానిని రామేశంగారి చేతికి అందించేడు, కృష్ణమాచార్యులు.

రామేశం గారు చదవడం మొదలు పెట్టేరు.

''గత పదిహేను ఏండ్లగా జర్మనీలో హైపెరికమ్ వాడకం వేలం వెర్రిగా పెరిగి పోయింది. 'ప్రోజెక్' వాడకంతో పోల్చి చూస్తే హైపెరికమ్ వాడకం ఇరవైఅయిదింతలు ఎక్కువగా ఉంది. ఇప్పుడు అమెరికాలో మానసిక మాంద్యత ('మెంటల్ డిప్రెషన్')ని అదుపులో పెట్టడానికి వాడే పత్ర ఓషధులలో హైపెరికమ్

ప్రధానమైనది. దీనిని ముసలమ్మ మందులా తృణీకార భావంతో చూడకుండా పెద్ద పేరున్న వైద్యులే దీని మీద ముమ్మరంగా పరిశోధనలు చేస్తున్నారు......''

వికసించిన మందార పువ్వులా, వికసించిన హైపెరికమ్ పువ్వులా, రామేశం గారికి విషయం అర్థం అయిపోయింది. పార్వతిని పీడిస్తూన్న రోగాన్ని ఏ పేరు పెట్టి పిలిస్తేనేమిటి? 'మల్టిపుల్ పెరసనాలిటీ డిసార్డర్' అనండి. 'మెంటల్ డిప్రెషన్' అనండి. దయ్యం పట్టిందనండి. రెండు వేల సంవత్సరాల కిందట జెర్మనీ లోనూ మానసిక మాంద్యతని దయ్యమనే అనుకున్నారు. ఇప్పటికీ మన దేశంలో అదే మాట వాడుతున్నాం. మాట మారింది కానీ, మందు ఒక్కటే – అప్పుడూ, ఇప్పుడూ.

మన వాళ్లు దయ్యం పట్టిందని భూత వైద్యుడి దగ్గరకేనా వెళతారు కానీ, మానసిక రోగాలని కుదిర్చే వైద్యుడి దగ్గరకి వెళ్లడానికి రవ్వీమని ఇష్ట పడరు. అదొక నామర్దాగా భావిస్తారు. ఇంటికొచ్చిన కొత్త కోడలికి పిచ్చెక్కింపించేసి పిచ్చాసుపత్రిలో పడేసేరని అపవాదు వస్తుందేమోనని మరొక భయం. ఈ రకపు ప్రపంచజ్ఞానపు మోతాదు రామేశం గారిలో బాగానే ఉంది.

అందుకోసమే ఆయన శాస్తుర్లు గారింటికి, స్వయంగా సలహా ఇవ్వడానికి, మర్నాడు ఉదయమే మళ్లా పిఠాపురం వెళ్లేరు.